


ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్ట్ విడుదల

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ వివరాలు విద్యా శాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్స్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, పిఇటి ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ పండిట్‌ల వెబ్‌సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలించుకోవాలని తెలిపారు. వారి అభ్యంతరాలపై సంబంధిత నమూనా ప్రొఫార్మాతో ఈ నెల 8, 9వ తేదీల్లో కార్యాలయపు పని వేళలల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఇళ్ల స్థలాలు చూపించాలి

ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇళ్ల పట్టాలు(హామీ పత్రాలు) ఇచ్చిన వారికి ఇంటి స్థలం చూపించాలని సిపిఎం డిమాండ్ చేసింది. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. నగరంలోని అంబేద్కర్ నగర్‌లో చేపట్టిన యాత్రలో స్థానికులు పలు సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. పట్టాలిచ్చారు గాని స్థలాలు నేటికీ చూపించలేదని లబ్ధిదారులు వాపోయారు. పట్టాలిచ్చిన వారికి ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.1.80 లక్షలు మాత్రమే సాయం అందించారన్నారు. ఈ మొత్తంతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తవుతుందని వాపోయారు. దీంతో ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లుల భారాలను పలువురు సిపిఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యల్ని తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వీటిలో ప్రధానంగా గత వైసిపి ప్రభుత్వం నగరంలో సుమారు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా నేటికీ వాటికి స్థలం చూపించలేదని తెలిపారు. వెంటనే హామీ పత్రాలు ఇచ్చిన వారికి స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. వెలుగుబందలో పట్టాలిచ్చిన వారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన సాయం పునాదులకే సరిపోయిందన్నారు. ప్రభుత్వ సాయం ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోక వేలాదిమంది ఇంటి నిర్మాణం ప్రాథమిక స్థాయిలో, మరి కొద్ది మంది సగంలో నిలిపిశారని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తి కావాలంటే కనీసం రూ.5లక్షల సాయం అందించాలన్నారు. టిడ్కో గృహాలు అర్హుల జాబితాలో ఉన్న వారందరికీ కేటాయించాలని కోరారు. ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తీవ్రంగా మోపుతోందన్నారు. గత ప్రభుత్వం మోపిన ట్రూఅప్ ఛార్జీల బారాన్ని కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందన్నారు. దీనివల్ల సగటున రూ.200 నుంచి రూ.500 ప్రతి కుటుంబంపై నెలకు అదనంగా భారం పడుతోందన్నారు.



టిడ్కో గృహాల వద్ద స్థానికుల సమస్యలను వింటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రజలపై విద్యుత్ భారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు కెఎస్‌వి.రామచంద్రరావు, బి.పూర్ణిమరాజు, సిపిఎం నాయకులు ఎస్-ఎస్.మూర్తి, నగర కమిటీ సభ్యులు రాంబాబు, నాయకులు తాతారావు, రాజేష్, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న టిడ్కో గృహాలు

రాజమహేంద్రవరం రూరల్ : ధవళేశ్వరంలోని టిడ్కో గృహాలు అడవిని తలపిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ధవళేశ్వరం సమీపంలోని టిడ్కో, వాంబే గృహాలను వారు సందర్శించారు. ఎ,బి, సి బ్లాకుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు సమస్యలను వివరించారు. తాము మూడేళ్ల నుంచి ఉంటున్నామన్నారు. చుట్టూ తుప్పలతో అడవిలో నివశిస్తున్నట్టు ఉంటుందన్నారు. ఏ బ్లాక్ చూసిన దట్టమైన తుప్పలతో నిండిపోయిందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. విద్య, వైద్యం కోసం రాజమండ్రి నగరానికి పరుగులు తీయాల్సి వస్తుందని వాపోయారు. డ్రెయినేజీ ఇక్కడ ప్రధాన సమస్యగా ఉందన్నారు. డ్రెయినేజీ మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయిందన్నారు. తాగునీటి సౌకర్యం లేదన్నారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడారు. టిడ్కో వాసులకు వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మంచినీటి కోసం వాటర్ ట్యాంకులు రెండు రోజులకు ఒకసారి ఇస్తున్నారని, వేసవి నేపథ్యంలో తాగునీటి వసతిని ఏర్పాటు చేసేవరకూ ప్రతి రోజూ నీటిని సరఫరా చేయాలన్నారు. తుప్పల వల్ల పాముల బెడద ఎక్కువైందని, వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేయించాలన్నారు. తాగునీటి ట్యాంకును వెంటనే పూర్తి చేయాలన్నారు. సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ప్లాట్లను ఇల్లు లేని పేదలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.రామకృష్ణ, ఐ.సుబ్రహ్మణ్యం, కె.రామసుందర్రావు, ఎస్ఎస్.మూర్తి, పేరయ్య లింగం, ప్రకాష్, రాంబాబు రాజేష్, భాస్కర్ పాల్గొన్నారు.



తుప్పలతో నిండిపోయిన టిడ్కో గృహాల ప్రాంతాన్ని పరిశీలిస్తూ...



సమస్యలను వింటూ...



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ, పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్ఎ వాసు

అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ స్థానిక ఆర్ఎంసి కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మార్చి 12 నుంచి 15 వ తేదీ లోపు అమరావతి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో టెండర్లను తెరిచి కాంట్రాక్ట్ సంస్థలను ఎంపిక ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. మున్సిపాలిటీల ఆదాయాన్ని వాటికే చెందేలా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. గోదావరీ పుష్కరాలకు సంబంధించి అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులు, ప్రజా ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తామని తెలిపారు. సిటీ ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీల ఆర్థిక పరిపుష్టికి ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమీక్షించడం శుభ పరిణామం అన్నారు. 2027లో గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధం చేస్తామన్నారు.

మహిళల కోసం గులాబి మరుగుదొడ్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మహిళలకు సౌకర్యవంతంగా ఉండేలా గులాబి మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. శనివారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా కోర్టు ఆవరణను ఆనుకుని రూ.10.00 లక్షల వ్యయంతో నిర్మించిన గులాబి మరుగుదొడ్డిని కలెక్టర్ పి.ప్రశాంతి, సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మరుగుదొడ్డిలో పాలుతాగే పసివారితో వచ్చేవారికి ప్రత్యేకంగా ఒక రూము ఏర్పాటు చేసామని, శానిటరీ నాప్ కిన్ అమ్మే యంత్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా తగిన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పిల్లలకు డైపర్స్ మార్చుకోవడానికి తగిన వసతి కల్పించామన్నారు. పిల్లలకు ఉయ్యాల, దుస్తులు మార్చుకొనే గది కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పింక్ టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి




రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువత

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి వ్యక్తీ అవకాశం ఉన్నంత వరకు రక్తదానం చేసి మరొక వ్యక్తి ప్రాణాలు కాపాడాలని మానవత సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్ధన రావు అన్నారు. తాళ్లపూడి ఆర్యవైశ్య సంఘం మండల మానవత శాఖ శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జనార్ధనరావు ప్రారంభించారు. సింహాద్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మానవత సేవా సంస్థ నిర్వహిస్తున్న జాబ్ మేళా సేవా కార్యక్రమాలను వివరించారు. యండపల్లి శేఖర్ మాట్లాడుతూ సంఘాలు, సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు అవసరమైన ప్రతి ఒక్కంరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్త దానం చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన సంజీవిని బ్లడ్ బ్యాంకు ప్రతినిధి డాక్టర్ ప్రకాష్, వైద్య సిబ్బంది ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మానవత శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్, చాగల్లు మండల మానవత శాఖ చైర్మన్ జెకె.ప్రసాద్, సనపల రాజశేఖర్, అప్పన వీర హనుమంతు, దుర్గాప్రసాద్, అప్పన చంద్రధర గుప్త, గోకవరపు మాణిక్యం తదితరులు పాల్గొని సేవలు అందించారు.

కార్టూ'నిజం'



ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ మహిళలకు సమానత్వం నినాదంతో ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ శక్తి యాప్ ద్వారా మహిళల రక్షణ భద్రతా కోసం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలో మహిళా రక్షక్ ఏర్పాటు చేసిన ఎస్‌పి డి.నరసింహా కిషోర్‌ను కలెక్టర్ అభినందించారు. నన్నయ్య యూనివర్సిటీ విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షన కుటుంబం నుంచి పారదోలినపుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి ఎంఎలఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిఎస్ఎల్ అధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిఎస్ఎల్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర్, క్యాన్సర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ గోగినేని చౌదరి, డాక్టర్ సింధు, కలక్టరేట్ ఎఒ ఎండీ ఆలీ, అడ్మిన్ సూపరింటెండెంట్ కె.పద్మావతి పాల్గొన్నారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో సిఐ టి.గణేష్ ఆధ్వర్యాన మహిళా సిబ్బందితో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హరిబాబు, క్రాంతి సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం మేజర్ పంచాయతీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కొమరం శ్రావణి, కార్యదర్శి బి.శిరీషలను జెడ్‌పిటిసి దాసరి శ్రీరంగ, ఎంపిపి సుంకర శ్రీవల్లి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుంకర వీరబాబు, ఎంపిడిఒ ఎం.గోవింద్, మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మహిళలు ఉన్నత విద్యనభ్యసించి, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న పిలుపునిచ్చారు. ఎంపిడిఒ వివివిఎస్.రామారావు అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన సన్మానోత్సవంలో ఆమె మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం టి.బాలకోటయ్య పాల్గొన్నారు.

కడియం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ, తమ ఉనికిని, ప్రతిభను చాటుకోవడంతో పాటు వివిధ రంగాలను శాసిస్తున్నారని కడియం ఎంపిడిఒ కె.రమేష్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆధ్యర్యంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సిఐ అల్లు వెంకటేశ్వరరావు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జెస్సీ సుప్రియ, ఎంఇఒలు మణికుమార్, నాగేశ్వరరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు. కడియం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళలను శనివారం ఘనంగా సత్కరించారు. సిఐ అల్లు వెంకటేశ్వరరావు ఆధ్యర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న, కానిస్టేబుల్స్ నాగ దుర్గ, రమణమ్మ, మణి కుమారి, ప్రసన్న, స్టేషన్ వర్కర్ మంగమ్మను సన్మానించారు.

తాళ్లపూడి నేటి ఆధునిక సమాజంలో కుటుంబాలతో పాటు అన్ని రంగాల్లోనూ ఏ విధమైన అభివృద్ధి సాధించాలన్నా మహిళ సహకారం లేనిదే సాధ్యం కాదని ఎంపిడిఒ రమణ అన్నారు. మండల కార్యాలయంలో పలువురు మహిళా ప్రజాప్రతినిధులను, మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర అభినందనీయమని కొనియాడారు. మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి, కార్యాలయ సూపరింటెండెంట్ నిర్మల, ఉపాధి హామీ పథకం ఎపిఒ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరిని ఘనంగా సన్మానించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇపిఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

దేవరపల్లి శ్రామిక మహిళల హక్కుల సాధనకు పోరాటాటే మార్గమని సిఐటియు గౌరవాధ్యక్షురాలు మల్లిపూడి వెంకటలక్ష్మి అన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తొర్లపాటి ఇందిర అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ శ్రామిక మహిళల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూడడం తగదన్నారు. వారికి కనీస వేతనాలు అమలు కావటం లేదన్నారు. ఐకెపి యానిమేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.స్వరూప రాణి సిఐటియు మండల కార్యదర్శి భగత్, రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకుడు దుగ్గిన మాణిక్యం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పత్తి శ్రీనివాసరావున ఆశ వర్కర్లు శిర ఝాన్సీ, రాపాక స్వర్ణ, షేక్ హసీనా, ఆకుల ప్రసన్న, కె.పద్మశ్రీ పాల్గొన్నారు. గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండి సూర్య ప్రకాశ రావు, కేశిరాజు సీతారామయ్య, పప్పు వెంకట రామారావు, గద్దే కృష్ణారావు, కేసిరాజు భారతీదేవి, వీరవల్లి శేషమణి, పాతాళ అన్నమ్మ, మేరీ వజ్రం, నిర్మలాదేవి, సుగుణలత, పద్మజ, మేరీ సరోజినీ, అరుణ కుమారి, వెలిచెర్ల సూర్యనారాయణమూర్తి, యలమాటి సత్యనారాయణ, ఈశ్వర్ పాల్గొన్నారు.

నల్లజర్ల ప్రగతి అసోసియేషన్ ఫర్ రూరల్ డవలప్మెంట్ (పార్డ్ ఇండియా) స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో సర్పంచులు పల్లి జ్యోతి, గోతం సత్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. సంస్థ మండల శాఖ అధ్యక్షులు ఎం.డి.షరీఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు బేతాళ వీరాస్వామి, కూరపాటి నాగరాజు, బొందల శ్రీనివాస్, జివివి.ప్రసాద్, పి.ధర్మేష్, సోమిశెట్టి వెంకట్రావు, రాంబాబు, శ్రీనివాస్, పి.కృష్ణవేణి పాల్గొన్నారు.

నిడదవోలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మనోజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమిశ్రగూడెం పంచాయితీ మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. గ్రామ పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని ట్రస్ట్ నిర్వాహకురాలు విజయశ్రీనివాస రెడ్డి అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద రోగులకు విశిష్ట సేవలు అందించిన నర్సులకు నిడదవోలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర అధ్యక్షతన సత్కారం చే శారు. హెప్సిబా, ప్రమోద, హేమలత, జోషిక, సత్యవతి, భాను, మాధురి, ఎండి రజిని, చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరాలాల్, పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ కాసిం, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అన్వర్ ఖాన్, మహిళా నాయకురాలు ముప్పిడి విజయలక్ష్మి పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



దేవరపల్లిలో సభలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



నిడదవోలులో పారిశుధ్య కార్మికులకు సత్కారం



కడియంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తాళ్లపూడిలో మహిళా ప్రతినిధులకు సన్మానం

సాగు నీరందని పంట పొలాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దాళ్వా సాగుకు ఆదిలోనే సాగునీటి ఎద్దడితో వరిచేలు బీటలు వారి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ పెట్టిన ఖర్చు ఏమవుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. చిలకపాడు, వేలివెన్ను రైల్వే ట్రాక్ దిగువన, మండలంలో ప్రధాన అత్తిలి కాలువ నుంచి, చిలకపాడుకు వచ్చే మొండి కాలువ కింద సుమారు 150 ఎకరాల సేద్యం చేసే ఆయకట్టు రైతులు తమ్మన నరేష్, నాగోలు నాగేశ్వరరావు, నిడదవోలు గోపాలరావు, పిల్లి నాగముని, దుద్దుపూడి గోపాలకృష్ణ, తమ్మన రామచంద్రరావు, చిమ్మ గంగరాజు, కడలి సత్యనారాయణ వాపోతున్నారు. నీటి ఎద్దడిపై అధికారులకు విజ్ఞప్తి చేస్తే, నీటి ఎద్దడి ఉందని, వంతులవారీ విధానంలో సాగునీరు విడుదల చేస్తున్నామని చెబుతున్నారన్నారు. పది, పన్నెండు రోజులకు ఒకసారి రోజుకు రెండు గంటల పాటు వంతులవారీ విడుదలయ్యే నీరు చేలకు సరిపోవడం లేదని వారు చెబుతున్నారు. వరి నాట్లు వేసి, ఇప్పటికి రెండు నెలలు దాటిందని, సాగు నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో పంట ఎండిపోయే స్థాయికి చేరుకుందన్నారు. పంట చేతికొచ్చేందుకు ఇంకా సుమారు రెండు నెలలు పైనే సమయం ఉండడంతో పూర్తిస్థాయిలో నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఇప్పటివరకూ పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ప్రతి ఐదు రోజులకు ఒకసారి చేనుకు తడి అవసరం పడుతుందని, ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదని, ఒక రెండు వారాలపాటు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తే, ముప్పు తప్పించుకోవచ్చని వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేసి, పంట చేతికి అంది వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నీరందక ఎండిపోయిన పొలాల వద్ద రైతులు

ఎస్‌సిలకు నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-కడియం

టిడిపి ఎస్‌సి సెల్ నాయకుల సమావేశం స్థానిక మార్గాని గెస్ట్ హౌస్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్‌సిలకు బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల కేటాయింపులు ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. టిడిపి పాలనలో నిధులు కేటాయంచడం గొప్ప విషయంగా వారు అభివర్ణించారు. దీనిపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ మద్ద మణిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు కాయల సత్యనారాయణ, జల్లి కృపారావు, కనికెళ్ల బుల్లియ్య, బుల్లాడి జాను, ఇప్పర్తి శ్రీను, శీలం రవి, చిల్లి దాసు, పల్లి సురేష్, కప్పల వెంకన్న, చీకట్ల చంటి, శీలం గోపాలం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఇంజరం సమీపంలోని యానం - ద్రాక్షారామ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..కాకినాడ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో వారి వద్ద మద్యం సీసాలు ఉన్నాయి. దీంతో సుంకరపాలెం ఎక్సైజ్ సిబ్బంది విద్యార్థులను వెంబడించారు. దీంతో ఆ విద్యార్థులు వారి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం వేగాన్ని పెంచారు. ఈ నేపథ్యంలోనే ద్రాక్షారామ వైపు నుంచి వస్తున్న లారీని విద్యార్థులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరప మండలం అడవిపూడి గ్రామానికి చెందిన కేతా శ్రీరామ్ (21) తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మరో విద్యార్థి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎక్సైజ్ పోలీసులు విద్యార్థులను వెంబడించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థి కుటుంబ సభ్యులు, స్థానికులు సుంకరపాలెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు. దీంతో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటనా స్థలానికి కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, స్థానిక నాయకులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

వివాహితపై కత్తితో దాడి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వివాహిత మహిళపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అనాతవరం గ్రామం ఎదురుమూడి పుంత గ్రామానికి చెందిన పంతగంటి జయ రామకృష్ణ తమ పక్కింటిలో నివాసముంటున్న చాట్ల మాలతిపై శనివారం కత్తితో దాడి చేశాడు. జయ రామకృష్ణ భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ ఉంటోంది. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మాలతికి భర్త కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం మధ్యాహ్నం మాలతి ఇంటి నుండి బయటకు వెళుతున్న సమయంలో ఆ చుట్టుపక్కల పిల్లలు అల్లరి చేస్తుండగా ఆమె వారిని మందలించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న జయ రామకృష్ణ కోపంతో కత్తితో మాలతిపై దాడి చేశాడు. దాడికి గురైన మాలతి అపస్మారక స్థితికి చేరడంతో ఆమెకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం మత్తులో వాహనం నడుపుతున్న వ్యక్తిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరచగా జడ్జి నెల రోజులు జైలు శిక్ష విధించారు. సాధారణ వాహన తనిఖీలలో భాగంగా మండలంలోని చెముడులంకకు చెందిన మజ్జి రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. దీంతో అతనిని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచామన్నారు. జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ నిందితుడు రాజుకు నెల రోజులు జైలు శిక్ష విధించినారని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక బాలుర హైస్కూల్ వద్ద పట్టణానికి చెందిన విత్తనాల దొంగ అబ్బాయి కల్లు గీసుకుని వస్తుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను గాయాలపాలయ్యాడు. వైద్యం నిమిత్తం పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.



చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

రూ 4.65 కోట్ల చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని 36 డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ పథకం ద్వారా మంజూరైన రూ.4.65 కోట్ల రుణాల చెక్కులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పంపిణీ చేశారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సిఎంఎం భ్రమరాంబ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ఈ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గెడ్డం పెదకాపు, సిఐలు నర్గీస్, శ్రీదేవి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి మంగరాజు, పూల భవానీలక్ష్మి, ఉపాధ్యక్షులు బిహెచ్.మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వపై డివిజన్ స్థాయి శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వమిత్వ' సర్వేపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో డిపిఒ రవికుమార్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సకాలంలో ఈ సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి సంబంధించిన అన్ని వివరాలు ఈ సర్వేలో నమోదవుతాయన్నారు. డివిజన్లోని 11 మండలాల్లో ఒక్కొక్క మండలం నుంచి 10 మంది చొప్పున 110 మంది పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఒటి సాయిరాం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చైతన్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

స్థానిక సమస్యలపై ప్రజలను చైతన్యం చేసేందుకు సిపిఎం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రజా చైతన్య యాత్రలను ప్రారంభించింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో జరిగిన ప్రజా చైతన్య యాత్రలో స్వయంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు ఆ మండలంలో పలుగ్రామాల్లో సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సమస్యలపై అధ్యయనం చేస్తూ... ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ... పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా సిపిఎం బృందం వద్దకు వచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు. పలుచోట్ల స్థానికులు వినతిపత్రాల రూపంలో వారి సమస్యలను బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనుకున్న దానికంటే ప్రజల నుంచి ఈ యాత్రకు అనూహ్య స్పందన వచ్చింది. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నామని, ఓట్లకు ముందు తమను వినియోగించుకుంటున్నారని, ఆపై గాలికొదిలేస్తున్నారని పాలకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. కనీసం తాగునీరు కూడా అందించని స్థితిలో ప్రభుత్వం ఉందని పలువురు వాపోయారు. మొత్తంగా స్థానిక సమస్యలపై ఉద్యమానికి సిద్ధమవాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం నుంచి ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమైంది. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఆధ్వర్యంలో సిపిఎం నాయకుల బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంది.

మరో పక్క కూటమి ప్రభుత్వం తన గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోంది. సమస్యలను పరిష్కరించాలని పోరాటానికి దిగిన వారిపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ వారంలో జరిగిన ఆశాల నిర్బంధమే దీనికి నిదర్శనం. పని ఒత్తిడి తగ్గించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించాలనే తదితర డిమాండ్లతో ఆశా వర్కర్స్ యూనియన్ 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి విజయవాడకు సొంత ఖర్చులతో బయలుదేరిన ఆశాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మహిళలని కూడా చూడకుండా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గత సర్కారు ఇదే విధానాలను అవలంబిస్తే వ్యతిరేకించిన కూటమి నాయకులు, ఇప్పుడు వారే పాలకులుగా ఉండి అరెస్టులు చేయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రబీ సాగుకు నీటి గండం

రబీ సాగుకు నీటిగండం మొదలైంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావటంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాలలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విధితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి రెండు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలనికేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్ధత వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునికీకరణ, తూడు కాడ తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్ధాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించింది. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిల్వ చేసుకోవాలనే ముందుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తాగునీటి వంతు వారీ విధానంతో నీరు శివారు పొలాలకు చేరక రైతులు ఆందోళన చెందుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాల్వల ఆధునికీకరణ చేపట్టాలి. ఇప్పటికే సాగునీటి కోసం కాకినాడ జిల్లా తాళ్లరేవులో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వం స్పందించకుంటే మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంది.

వేసవి ఉష్ణోగ్రతలు జిల్లా వాసులను దారితెస్తున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరాసరిన 38 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం జిల్లా కేంద్రాలతో పాటు ఇతర పట్టణాలు, పల్లెల్లో సైతం వడగాల్పులు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రహదారులు వెలవెలబోతున్నాయి. రానున్న కాలంలో ఎండల తీవ్రత మరింత పెరగుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.



యానాం వార్తలు


నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న న్యాయవాదులు

మిల్క్ బాయిలర్స్ ఆందోళన విరమణ...

ప్రజాశక్తి - యానాం

వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా చేపట్టిన ఆందోళన శనివారం సాయంత్రం విరమించారు. పుదుచ్చేరి విద్యాశాఖ ఉన్నతాధికారులు రూ.10 వేలు నుంచి రూ.18 వేలు వేతనాలు త్వరలో పెంచుతామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. దీక్షా శిబిరాన్ని న్యాయవాదులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆందోళనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కమిడి విజయ్‌కుమార్, అన్నంపల్లి ఉషారాణి, స్వరాజ్యలక్ష్మి, భ్రమరాంబిక, మోక్షిత పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదేశాలతో ఓల్డ్ ఏజ్ హోం ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. సుమారు 20 ట్రాక్టర్లు, వందమంది సిబ్బందితో చెత్తను తొలగించారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మల్లాడి కృష్ణారావు తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పోలీస్ స్టేషన్లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎస్‌పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు పాల్గొన్నారు. పలువురు మహిళలను సత్కరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సావిత్రి నగర్, కనకాలపేట గ్రామాలకు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే మిల్క్ బాయిలర్స్ సిబ్బంది ఆందోళనకు సంఘీభావం తెలిపారు. దీక్షలో ఉన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, శ్రీమంతుల శ్రీధర్, పైడి కొండల రాజాబాబు, చెక్కల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సింహ వాహనోత్సవం

ప్రజాశక్తి - యానాం



లడ్డూను అందిస్తున్న ఉపాధ్యాయులు

యానాంలో శనివారం సింహ వాహనోత్సవం ఘనంగా జరిగింది. యానాం వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా యానాం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ క్యాక్రమాన్ని నిర్వహించారు. ఆయా వీధులలో రథంపై కొలువైన మీసాల వెంకన్నను భక్తులు దర్శించుకుని పూజలు చూశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎంజిజి బాలుర ఉన్నతపాఠశాలలో స్వామివారి అభిషేకం లడ్డుకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయరాలు కెఎన్.లక్ష్మి రూ.11,500కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, డిటి జ్యోతి వెంకటేశ్వరరావు ఆమెను సత్కరించి అభినందించారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



చెక్కు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

బీమా, సివిల్ తగాదాలు, మోటారు వాహన ప్రమాదాలు, రాజీ పడతగ్గ క్రిమినల్ కేసుల పరిష్కారంలో కక్షిదారులకు అవగాహన కల్పించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి గంధం సునీత మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలనే లక్ష్యంతో పూర్వపు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని నాలుగు రెవెన్యూ జిల్లాల పరిధిలోని కోర్టుల్లో బెంచీలు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో పరిహారం చెల్లింపులో ఆలస్యం నివారణకు లోక్ అదాలత్ నిర్వహించి కక్షిదారులకు సత్వర న్యాయం చేసేందుకు ఇరు పార్టీలకు డబ్బు వథా కాకుండా చూడడం, సమయం వథాను నివారించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇటువంటి లోక్ అదాలత్‌లతో ఇరు పక్షాలకూ ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఆ మేరకు ముందుగా ఇరు పార్టీలతో సమావేశం నిర్వహించి రాజీ చేయడం ద్వారా ఈరోజు ఆమేరకు అవార్డు జారీ చేశామన్నారు. కోర్టులపై భారం తగ్గుతుందన్నారు. జిల్లాలో సుమారు 80 వేల కేసులు పెండింగులో ఉండగా ఈసారి 10 వేల కేసుల గుర్తించామన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంతో కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా న్యాయమూర్తులు, కోర్టులు పని చేస్తాయని డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, అదనపు సెషన్ కోర్టుల న్యాయమూర్తులు వైబి.నాయుడు, డి.విజయ గౌతమ్, బి.పద్మ, ఎన్.రెడ్డి ప్రసన్న, సి.రమ్య, జి.శ్రీనివాస రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.

లంక గ్రామాల రహదారిని ఆధునికీకరించాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

పాశర్లపూడి నుంచి వయా బి.దొడ్డవరం మీదుగా పెదపట్నం లంక ఆర్అండ్‌బి రహదారిని ఆధునికరించాలంటూ ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య డిమాండ్ చేశారు మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి కుసుమ వనజ కుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ లో రహదారి ఆధునికీకరణ పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఆర్ అండ్‌బి ఎఇ సురేష్ తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో తాగునీటి సమస్యలపై చర్చించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షులు జాలెం రమణకుమారి, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-నల్లజర్ల

హైదరాబాద్ బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ సుగంధ మొక్కల సంస్థ ఆవరణలో ఈ నెల 18, 20 తేదీల్లో ఔషధ సుగంధ పంటల సాగుపై శిక్షణ ఇవ్వనున్నట్లు చీఫ్ సైంటిస్ట్ జిడి.కిరణ్ బాబు తెలిపారు.వివరాలకు 491043252, 9493408227 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షకు విద్యార్థుల గైర్హాజరు

ప్రజాశక్తి-తాళ్లపూడి

మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు శనివారం 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్ చీఫ్ గౌరీనాథ్ తెలిపారు. వైఎస్ఆర్‌పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 249 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేయగా 234 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని చీఫ్ తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాడిపూడిలో మహాశివరాత్రి రోజున గోదావరి నదిలో స్నానానికి వెళ్లి మరణించిన ఐదుగురు యువకుల కుటుంబాలకు అండగా ఉంటామని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఒక్కొక్క కుటుంబానికి ప్రకటించిన రూ.ఐదు లక్షల చెక్కులను ఎంఎల్ఎ శనివారం అందజేశారు. ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఆర్‌డిఒ సుస్మిత మృతుల చిత్రపటాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. మాజీ ఎంఎల్ఎ జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి టివి.రామారావు ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష 50 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నామా గోపాలం, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, కొండబాబు, కాకర్ల సత్యేంద్ర, వైసిపి నాయకులు తోట రామకృష్ణ, మండిగ గిరి, నామా ప్రకాశం, వి.చిన్ని, పాల్గొన్నారు.

బాలాజీ స్వామి ఆదాయం రూ.3.36 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానమునకు వివిధ విభాగాల ద్వారా శనివారం రూ.3,36,594 లు ఆదాయం సమకూరిందని ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ఇందులో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టు కు రూ.ఐదు వేలు ఆదాయం రాగా, నిత్య అన్నదాన ట్రస్ట్ కు రూ.77,414రూ లు ఆదాయం సమకూరిందన్నారు 5 వేలు మంది యాత్రికులు స్వామి వారిని దర్శనం చేసుకోగా, 3 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు అన్నారు.

10 నుంచి నరసింహ స్వామి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - కోరుకొండ

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుండి ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖాల అధికారులతో రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ శనివారం సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగునీటి కొరత లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అశోక్ కుమార్, తహసీల్దార్ సుస్వాగతం, సిఐ సత్యకిశోర్, ఎక్సైజ్, ఫైర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వం

ప్రజాశక్తి - అంబాజీపేట

ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు అనేక హామీలు ఇచ్చిన సిఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మహిళలను మోసం చేస్తూ దుష్ట పరిపాలన సాగిస్తుందని వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా అంబాజీపేటలో మండల వైసిపి అధ్యక్షుడు విత్తనాల ఇంద్ర శేఖర్ అధ్యక్షతన మండల పార్టీ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పి.గన్నవరం నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాధినేత వైఎస్.జగన్ రాష్ట్రంలోని మహిళల అభివృద్ధిని ఆకాంక్షించి ప్రత్యేకంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తే ప్రస్తుత సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రభుత్వంలో మహిళలపై అన్యాయాలు అత్యాచారాలు అక్రమాలు ఎక్కువైనా పట్టించుకోవడంలేదని విమర్శించారు.

వల్లభ స్వామికి రూ.3.55 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3,55,197 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్లు ద్వారా రూ.2,60,480, అన్నదాన విరాళాల ద్వారా రూ.56,107, కేశఖండన ద్వారా రూ.7,000, తులాభారం ద్వారా రూ.600, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,810, స్వామి వారి కార్మికుల ద్వారా రూ.200 వచ్చిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

అనుమతులను పరిశీలించి మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ



అధికారులతో చర్చిస్తున్న మంత్రి నారాయణ

లే అవుట్లు, బిల్డింగ్ నిర్మాణ అనుమతుల కోసం కుడా, నగరపాలక సంస్థ కార్యాలయాలకు వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక శారదమ్మ గుడి సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో కాకినాడ నగరపాలక సంస్థ, కుడా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. తొలుత టౌన్‌ప్లానింగ్, అర్బన్ అథారిటీస్ విభాగాలపై అధికారులతో చర్చించారు. నగరపాలక సంస్థ, కుడా పరిధిలో కన్వర్షన్ ఆఫ్ ల్యాండ్స్, లే అవుట్స్, బిల్డింగ్ ప్లాన్స్ అనుమతులపై ఆరా తీశారు. ఎన్నింటికి అనుమతులు ఇచ్చారు..? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలు ప్రశ్నించారు. నగరపాలక సిటీ ప్లానింగ్ విభాగం అధికారులు ఇచ్చిన సమాధానాలపై మంత్రి మంత్రి నారాయణ లోతైన వివరణ కోరారు. రాష్ట్ర స్థాయి అధికారులతో ఆయన నేరుగా టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడి కాకినాడ నగరపాలక సంస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్, కుడా ద్వారా ఇన్‌కమ్ జనరేట్ చేసుకోవాలిన అధికారులు సూచించారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించి కుడాలో పెండింగ్‌లో ఉన్న 976 దరఖాస్తులను, నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న 204 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువును ఆరు నెలల పెంచాలని మంత్రి సూచించారు. లే అవుట్స్‌కు నాలుగు రోజుల్లో, బిల్డింగ్ పర్మిషన్స్ రెండు రోజుల్లో అనుమతులు ఇవ్వాలని మంత్రి నారాయణ సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎంఎల్ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, కమిషనర్ భావన, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, సెక్రటరీ ఎ శ్రీకాంత్ రెడ్డి, ఎంహెచ్ఒ డి.పృథ్వీచరణ్, సిటీ ప్లానర్ రామచంద్రరావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.